

పోకిరీలకు 'షీ' టీంల దడ



- ముఖ్య కూడళ్లలో ప్రత్యేక నిఘా
- 30 మందిపై క్రిమినల్ కేసులు నమోదు
- 120 మందికి కౌన్సెలింగ్

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కమిషనరేట్ వ్యాప్తంగా షీ టీంలు పోకిరీలకు దడపుట్టిస్తున్నాయి. పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పర్యవేక్షణలో కమిషనరేట్ వ్యాప్తంగా 10కిపైగా షీ టీంలు పనిచేస్తున్నాయి. మహిళలు, విద్యార్థినులు, పోకిరీల వేధింపులను ఎదుర్కొన్నట్లయితే ఫిర్యాదు చేసే విధానంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 2016లో కమిషనరేట్‌లో షీ టీంలు ప్రారంభమయ్యాయి. షీటీంకు చెందిన పోలీసులు మఫ్టీలో ముఖ్య కూడళ్ల వద్ద నిఘా పెట్టి పోకిరీలను ఆధారాలతో పట్టుకునేందుకు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నారు. వేధింపుల తీవ్రతను బట్టి తల్లిదండ్రుల సమక్షంలో ఆధారాలను చూపిస్తూ కౌన్సెలింగ్‌ను నిర్వహించడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదుచేస్తున్నారు.

● విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

2023 జనవరి నుంచి అక్టోబరు 31 వరకు షీటీంలకు 197 ఫిర్యాదులు అందగా ఇందులో వేధింపుల తీవ్రత ఆధారంగా 30 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 102 ఫిర్యాదులు నేరుగా షీటీంకు రాగా, వాట్సప్ ద్వారా 13, క్యూఆర్ కోడ్ ద్వారా 4, పోలీస్‌కమిషనర్ ద్వారా 10, ఆతర పోలీసు ఠాణాలు, అధికారుల ద్వారా 6 ఫిర్యాదులు అందాయి. మరో 62 పోకిరీలు షీటంలకు రెడ్‌హాండెడ్‌గా పట్టుబడటంతో కేసులు నమోదు చేశారు. 27 మందిపై పెట్టి కేసులు నమోదు చేసి, 120 మందికి కుటుంబం సమక్షలో కౌన్సిలింగ్ నిర్వహించారు. 10 నెలల కాలంలో షీటం పోలీసులు కమిషనరేట్ వ్యాప్తంగా 155

మిగతా 8వ పేజీలో...

● ఫిర్యాదులకు ప్రత్యేక వాట్సాప్ నంబర్

విద్యాసంస్థలకు షీ టీంలు స్వయంగా వెళుతూ అశ్లీలత, వేధింపుల తీవ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పోలీసుశాఖ నేరుగా పోలీసు ఠాణాలకు వచ్చి విద్యార్థినిలు, మహిళలు ఫిర్యాదు చేయాల్సిన పనిలేకుండా వాట్సాప్ నంబర్ 8712670759, డయల్ 100 నెంబరును, క్యూఆర్‌కోడ్‌ను ప్రదర్శిస్తు న్నారు. ప్రయాణ సమయంలో మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన టీ సేఫ్ యాప్‌ను స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతి విద్యార్థిని, మహిళలతో డౌన్‌లోడ్ చేయిస్తున్నారు.

వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

-శ్రీలత, కరీంనగర్ మహిళా ఠాణా సీఐ



వేధింపులను ఎదుర్కొనే మహిళలు, విద్యార్థినిలు నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలి. షీ టీంలకు చెందిన పోలీసులు వివరాలను గోప్యంగా ఉంచి బాధితులకు న్యాయం చేస్తారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి నేతృత్వంలో షీ టీంలు నూతనోత్సాహంతో పనిచేస్తున్నాయి. పోకిరీల ఆగడాలను నియంత్రించేందుకు మరింత పగడ్బందీ చర్యలతో ముందుకు సాగుతాం.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీలత (ఫైల్)

నగరానికి చేరుకున్న రథయాత్ర

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



శ్రీరామయంత్రాన్ని దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తులు



శ్రీరామయంత్రం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అయోధ్యకు చేరే శ్రీరామ యంత్రంతో కూడిన రథయాత్ర బుధవారం నగరానికి చేరుకుంది. చైతన్యపురి మహాశక్తి ఆల యానికి చేరకున్న ఆ యంత్ర రథానికి గోరక్షా రాష్ట్ర కమిటీ సభ్యుడు వుట్కూరి మంజులాభార్గవీ రాధాకృష్ణారెడ్డి దంపతులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రథయాత్ర ఇన్‌చార్జీలు చంద్రమౌళిశర్మ, డాక్టర్ యజ్ఞం ప్రవీణ్‌కుమార్‌శర్మ మాట్లాడారు. కాంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీస్వామి పర్యవేక్షణలో శ్రీరామ యంత్ర రథయాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. అక్టోబరు 27న తిరుపతిలో ప్రారంభమైన ఈ యాత్ర నాలుగు రాష్ట్రాల మీదుగా త్వరలో అయోధ్యను చేరుకోనుందని తెలిపారు. అయోధ్యలో శాశ్వతంగా ప్రతిష్టించేందుకు 108 కిలోలతో కూడుకున్న బంగారు పూతతో కూడిన పంచ లోహ యంత్రాన్ని సాధారణ ప్రజలు దర్శించాలని స్వామీజీ సంకల్పించారని చెప్పారు. హైందవ ధర్మరక్షణకు నడుం బిగించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్న మహాశక్తి ఆలయానికి చేరుకు న్నామని తెలిపారు. కాగా రథ యాత్రకు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివరా మకృష్ణ, బండి సంపత్‌కుమార్, ఏఎఫ్‌బి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండ సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ బండ సుమారమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు గ్యారంటీతోనే మిల్లర్లకు ధాన్యం కేటాయింపు

- రైసు మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్

కరీంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మిల్లులకు ధాన్యం కేటాయించేందుకు రైస్‌మిల్లర్లు తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వరి ధాన్యం మిల్లింగ్‌పై సివిల్‌సప్లయి అధికారులు, ధాన్యం కొనుగోలు ఏజెన్సీ అధికారులు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అని తేల్చిచెప్పారు. సివిల్ సప్లయి కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎలాంటి అవకతవకలకు తావులేకుండా బ్యాంకు గ్యారంటీని ఆధారంగా చేసుకొని కేటాయిస్తామని చెప్పారు. తాలు, తప్ప, తేమ లేకుండా ఆ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ధాన్యాన్ని శుభ్రం చేయకుండా కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయవద్దని ఆదేశాలిచ్చామన్నారు. మిల్లుల వద్ద తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించడానికి వీలు లేదన్నారు. ఒకవేళ కోతలు విధించాలని ప్రయత్నిస్తే సదరు మిల్లర్ల పట్ల కఠి నంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రైసు మిల్లర్ల సంఘం ప్రతినిధులు పలు సమస్యలను ప్రత్యేధికారి దృష్టికి తీసుకురాగా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్, డీఎస్‌వో నర్సింగారావు, డీసీవో రామాను జాచారి, అధికారులు, రైసుమిల్లర్ల సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్

● ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూడాలి

గంగాధర: ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎటువంటి అతాంతరాలకు తావులేకుండా సక్రమంగా జరిగే విధం గా చూడాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకా ధికారి ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం గంగాధర మండలం మధురానగర్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో సరిపడా ప్యాడీ క్లీనింగ్ మిషన్లు అందు బాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు సన్నరకం ధాన్యాన్ని తీసుకు వచ్చి మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తామన్నారు. ఈసందర్భంగా రైతులు ఆరబోసిన ధాన్యాన్ని స్వయంగా తేమశాతాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్,ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, సివిల్ సప్లయ్ డీఎం రజనికాంత్, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు శ్రీకారం

- ఇళ్లకు స్టిక్కర్లను అతికించిన ఎన్యూమరేటర్లు
- 9వ తేదీ నుంచి సమాచార సేకరణ

కరీంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. బుధవారం ఎన్యూమరేటర్లు వారికి కేటాయించి ఎలక్ట్రోల్ బ్లాకులకు వెళ్ళి ఇంటికి స్టిక్కర్లు అంతికించారు. మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఉదయం ఎన్యూమరేటర్లు, సర్వేయర్లు సర్వేకు సంబంధించిన సామగ్రిని తీసుకొని వారికి కేటాయించిన బ్లాకులకు వెళ్ళారు. కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయితో కలిసి తిమ్మాపూర్, చిగురుమామిడి మండలాల్లో జరుగుతున్న సర్వే ఇంటింటి స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్వేను విజయవంతంగా చేపట్టాలని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. జిల్లాలోని 15 మండ లాలు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలను 1958 ఎలక్ట్రోల్ బ్లాక్‌లుగా విభజించి, సర్వేను పకడ్బం దీగా నిర్వహించేందుకు 1964 మంది ఎన్యూమరేటర్లను, 207 మంది సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, కుల గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, తప్పుగా సమాచారమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 9వ తేదీ నుంచి సర్వే ఎమ్యూనరేటర్లు ఇచ్చిన ప్రశ్నా వళిని పూర్తి చేసి అవసరమైన డాక్యుమెంట్లను ఇవ్వాలని, సర్వేకు సహకరించి విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.



ఎన్యూమరేటర్లకు సామగ్రిని అందజేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

సర్వేకు ప్రజలు సహకరించాలి



చిగురుమామిడి మండలం రేకొండలో ఇంటికి అంటించిన స్టిక్కర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

చిగురుమామిడి: ఇంటింటి సర్వేకు వచ్చిన అధికారులకు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం మండలంలోని రేకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మపల్లి 13 వార్డులో, చిగురుమామిడి 10 వ వార్డులో నిర్వహిస్తున్న సర్వేను, ఇంటికి వేసిన స్టిక్కర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే ఫారంలో తప్పులు నమోదు చేయవద్దని సూచించారు. సిబ్బందికి ఎలాంటి సందేహాలు ఉన్నా సూపర్ వైజర్‌లను సంప్రదించాలన్నారు. సేకరించిన డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టరు ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టరు అజయ్ యాదవ్, ఎంపీడీవో బాస మదుసుధన్, ఆర్ఐ సంతోష్, ఉన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

కరీంనగర్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాములను జిల్లా ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. బుధవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల, అధికారుల సమక్షంలో గదిని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నామని చెప్పారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కె.మహేశ్వర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో మంత్రి తనిఖీ



రేణికుంటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్ (మానకొండూర్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్ళు జరుపుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ళలో మోసాలకు తావుండకూడదన్నారు.

కొనుగోళ్ళ విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.

వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మంత్రి పొన్నం ప్రభాకర్

-సుభాష్‌నగర్, ఆంధ్రజ్యోతి

7

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

-కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

6

రెజ్లింగ్‌లో పతకాలు సాధించాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

-కరీంనగర్ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి

7

బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి: డీఆర్‌వో

కరీంనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంక టేశ్వర్లు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతు రుణాల పంపిణీ, రికవరీ, పీఎంజీపీపై రుణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల పథకాలకు సంబంధించి రుణలక్ష్య పురోగతిపై డీసీసీ డీఎల్‌ఆర్‌సీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ రుణాలను రీషెడ్యూల్ చేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబరు వరకు 6290.70 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. ఇందులో వ్యవ సాయ అనుబంధ రంగాలకు 2819.09 కోట్లు, ఎంఎస్‌ఎంఈ రంగంలో 1164.68 కోట్లు, విద్యారుణాలకు 8.06 కోట్లు, హౌజింగ్‌లోన్లు రూ.52.97 కోట్లు, స్వశక్తి సంఘాలకు 464.62 కోట్లు, ఇతర రంగాలకు 1781.55 కోట్లు రుణాలను ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రుణాల రికవరీపై శ్రద్ధ తీసుకోవాలని బ్యాంకర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం ఆంజనేయులు, ఆర్‌బీఐ అధికారి పల్లవి, ఏజీఎం నాబార్డు ప్రకాశ్, ఎస్‌బీఐ సీఎం రాంచంద్రుడు, యుబీఐ సీఎం టిజిబి ఏజీఎం, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



దీక్షలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరి వారీగా వేతనాలు అమలు చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం అవసరమైతే మరో సమ్మె పోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, ప్రధానకార్యదర్శి కొప్పుల శంకర్, కోశాధికారి రవీందర్‌రావు, బొజ్జ మధునమ్మ, వడ్లూరి లక్ష్మీనారాయణ, అశోక్, కాష్పాక శంకర్, కొత్తూరు మల్లయ్య, సంపత్, ములుగురి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

భగత్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి బస్తీ దవఖాన, రేకుర్తి, పద్మనగర్, సప్తగిరి కాలనీ యుపిహెచ్‌సీలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి ఓపీ సేవలు, రక్త పరీక్షలు, ఫార్మసీ విభాగంలో తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లిన మందులు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గర్భిణుల నమోదు, ఈడిడి, ఇమ్యూనైజేషన్, ఎన్‌సిడి సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



ఆరోగ్యకేంద్రంలో మందులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం ఏసీపీ నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న సైబర్ క్రైం ఏసీపీ నర్సింహారెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు ఠాణా ఎస్‌హెచ్‌ఓ అయిన ఏసీపీ నర్సింహారెడ్డి అన్నారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా బుధవారం కరీంనగర్ భగత్‌నగర్‌లోని బృందావన్ గార్డెన్‌లో సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఏసీపీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాలను చేపట్టామన్నారు. డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ ద్వారా జరిగే మోసాలు, వాయిస్ యక్లోనింగ్ ద్వారా సైబర్ నేరస్థులు ప్రజలను ఏమార్చి ఖాతాల్లో నుంచి డబ్బులను దొంగిలించే విధానాలపై ప్రజలకు ఏసీపీ అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, రిటైర్డ్ పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు రిటైర్డ్ ఎస్ఐ హరిప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగులు మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, రిటైర్డ్ డిఫెన్స్ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


మూడు నెలల వ్యవధిలో అన్నాచెల్లెళ్ల ఆత్మహత్య


చందన్‌కుమార్ (ఫైల్)

మల్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల వ్యవధిలో అన్నాచెల్లెలు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబం లో విషాదం అలుముకుంది. గతనెల 19న మల్యాలకు చెందిన బైరి చందన్ కుమార్ (37) గ్రామ శివారులో గల క్రిమిసంహారక మందు తాగాడు. విషయాన్ని తన మిత్రు లకు ఫోన్ చేసి సమాచారం అందించగా వారు వెంటనే చికిత్స కోసం జగిత్యాలకు అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. కొన్ని రోజుల తరువాత కరీంనగర్‌కు తీసుకువచ్చి చికిత్స అందిస్తుండగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మైగ్రేన్‌తోనే ఆత్మహత్య హత్యాయత్నానికి పాల్పడినట్లు మృతికి ముందు కరీంనగర్ ఆసుపత్రిలో న్యాయమూర్తికి వాంగ్మూలం ఇచ్చిన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బుధ వారం అంత్యక్రియలు నిర్వహించారు. గత ఆగస్టు 13న చందన్‌కుమార్ చెల్లి ఇదే గ్రామంలో ఉంటున్న గుండేటి లావణ్య(32) ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అన్నాచెల్లెలు ఇద్దరు మూడు నెలల వ్యవధిలోనే మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. వాహనాల తనిఖీలో కోరుట్ల నుంచి నిజామాబాదు వైపు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. లారీని సీజ్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ప్రాజెక్టు నిర్మాణానికి ముందు అనంతగిరి గ్రామం


అనంతగిరి గ్రామ సమీపంలో నిర్మించిన అన్నపూర్ణ రిజర్వాయర్


పూర్తి పరిహారం అందేనా?

- అనంతగిరి నిర్వాసితుల ఎదురుచూపులు
- ప్రాజెక్టుకు పోచమ్మ పేరైనా పెట్టలేదు
- అధికారులు మాటతప్పారని ఆగ్రహం
- పునరావాస కాలనీలోనూ సమస్యలే అధికం

ఇల్లంతకుంట, అక్టోబరు 6: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో గత ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మించింది. ప్రాజెక్టు పూర్తయినా నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం అందలేదు. గ్రామంలో 1600 ఎకరాల పట్టాభూమి, 837 కుటుంబాలతోపాటు 297 మందిని నిర్వాసితులుగా గుర్తించింది. 2013 చట్ట ప్రకారం పరిహారం చెల్లి స్తామని పేర్కొనగా కొంతమంది కోర్టును ఆశ్రయించారు. 2013 చట్ట ప్రకారం పరిహారంగా రూ.12లక్షల54 వేలతోపాటు ఇంటిస్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కోర్టును ఆశ్రయించిన వారికి రూ.5లక్షలతోపాటు ఇంటి స్థలాన్ని కోర్టులో డిపాజిట్ చేశారు. 23 మే 2017ను కటాఫ్‌గా నిర్ణయించిన ప్రభుత్వం 2019లో పరిహారం చెల్లించి 2020లో గ్రామాన్ని ఖాళీ చేయించింది. నిర్వాసితులకు ముంపునకు గురైన గ్రామ సమీపంలోనూ, తంగళ్లపల్లి మండలం పద్మనగర్ పరిధిలోకి వచ్చే ప్రాంతంలోనూ ఇళ్ల స్థలాలను ఇచ్చారు.

కటాఫ్ తేదీ డిమాండ్

తమకు పరిహారం 2019న ఇచ్చినందున దానినే కటాఫ్ తేదీగా పరిగణలోకి తీసుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. రెండేళ్లలో 120 మంది 18 ఏళ్లు నిండిన వారు, 67 మంది వివాహమైన వారు ఉన్నారు. ఇంటి కొలతల విషయంలో అన్యాయం జరిగిందని అధికారుల దృష్టికి తేగా మరోసారి సర్వే నిర్వహించారు. వారికి కూడా ఇంత వరకు న్యాయం జరగలేదు.

ప్రాజెక్టుకు పోచమ్మ పేరు పెట్టలేదు

అనంతగిరి గ్రామస్థుల ఆరాధ్య దైవమైన ముత్యాల పోచమ్మ పేరును ప్రాజెక్టుకు పెట్టాలని ముందు నుంచి గ్రామస్థులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాన్ని ఖాళీ చేసే వరకు సరేనన్న అధికారులు తర్వాత తమ పరిధిలో లేదని చేతులెత్తేశారు. ప్రాజెక్టుకు అన్నపూర్ణ రిజర్వాయర్‌గా నామకరణం చేశారు.

పునరావాస కాలనీల్లో సమస్యల తిష్ట

అనంతగిరి నిర్వాసితులకు గ్రామ సమీపంలో కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు జరగలేదు. పాఠశాలకు ప్రహరీ లేదు. సరైన మురుగునీటి కాలువలు లేవు. డివైడర్ పూర్తి కాలేదు. తంగళ్లపల్లి సమీపంలోని కాలనీలో సౌకర్యాలు లేక ఇంటిస్థలాలు పొందినవారు నిర్మాణాలు చేపట్టడం లేదు.

కలగా పర్యాటక గుర్తింపు

మూడు గుట్టల మధ్య నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మారుస్తామన్న హామీ కలగానే మిగిలిపోయింది. అప్పటి సీఎం కేసీఆర్ సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో హామీ ఇచ్చారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునే హక్కుతో పాటు ఫిష్‌మార్కెట్ ఏర్పాటు చేస్తామన్న హామీకూడా నెరవేర లేదు.



అనంతగిరి గ్రామస్థులు నివసిస్తున్న పునరావాస కాలనీ, గ్రామ పంచాయతీ కార్యాలయం

18 సంవత్సరాల ప్యాకేజీ అందలేదు


అల్లెపు నవీన్‌కుమార్, నిర్వాసితుడు అనంతగిరి

ప్రభుత్వం కటాఫ్ తేదీని నిర్ణయించినప్పుడే పరిహారం ఇవ్వ లేదు. పరిహారం ఇచ్చే నాటికి నాకు 18 సంవత్సరాలు దాటాయి. ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి.

ఫ్యామిలీ ప్యాకేజీ రాలేదు


గోకులకొండ రాజు, నిర్వాసితుడు అనంతగిరి

కటాఫ్ తేదీ తర్వాత వివాహమైంది. దీంతో ఫ్యామిలీ ప్యాకేజీ రాలేదు. నాలుగేళ్లవుతున్నా నిర్వాసితుల సమస్యలు తీరలేదు. రేషన్‌కార్డులు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు. పునరావాస కాలనీలో సమస్యలు ఉన్నాయి.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో కారులోన్ తీర్చలేక మనస్తాపంతో దాసారపు శ్యామ్ (27) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దాసారపు శ్యామ్ మూడేళ్ల క్రితం రుణంలో కారు తీసుకొని హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో నడిపిస్తున్నాడు. కారు ఈఎంఐలు కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పలుమార్లు తల్లిదండ్రులకు చెప్పుకొని బాధపడేవాడు. దీపావళి పండుగకి హైదరాబాద్ నుంచి మెట్‌పల్లికి వచ్చి తల్లిదండ్రులతో పాటే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు పనికి వెళ్లాక శ్యామ్ ఒక్కడే ఇంటి వద్ద ఉన్నాడు. సాయంత్రం 4గంటల సమయంలో శ్యామ్‌కు అతని తమ్ముడు కళ్యాణ్ ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో పక్కింటి వారికి ఫోన్ చేశారు. దీంతో వారు ఇంట్లోకి వెళ్లి చూడగా శ్యామ్ వంటగదిలోని ఇనుప పైపుకు చీరతో ఉరేసుకొని కనిపించాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులోన్ తీర్చలేక మనస్తాపానికి గురై శ్యామ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి దాసారపు ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు బుధవారం హుజూరాబాద్ కోర్టు జరిమానా విధించింది. శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు తనిఖీలు నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను బుధవారం హుజూరాబాద్ కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీపతి మహేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం కొండపూర్ గ్రామానికి చెందిన శ్రీపతి మహేష్ ద్విచక్ర వాహనంపై వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో కొత్తపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ క్రమంలో మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

రాయికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన వలసజీవి మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన పాల కుర్తి అశోక్ గత నెల 25న గుండెపోటుతో మస్కట్ (ఓమన్)లో మృతి చెందాడు. మృతదేహం రావడానికి మస్కట్‌లోని పలువురు అక్కడి అధికారులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందించి మృతదేహానికి రవాణా ఖర్చులు భరించి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి ఒడ్డెలింగాపూర్‌కు ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసింది. మృతదేహం స్వగ్రామం చేరడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

మెట్‌పల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డులో మహిళ మెడలోనుంచి నిందితులు పుస్తెలతాడును అపహరించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కందనవేణి వాణి తన కుమారుడికి ఇంటి సమీపంలో ఆడిపించుకుంటు అన్నం తినిపిస్తోంది. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు నిందితులు మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయారు. వాణి అరవడంతో చుట్టు పక్కలవారు రాగా గమనించిన నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు అపహరణకు గురైనట్లు సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సైదాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన వేముల మధునయ్య(68) అనే వ్యక్తి బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధునయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. బుధవారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరులేని సమయంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధునయ్య కూతురు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ..

- ఇద్దరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని గొల్లపల్లి బస్టాప్ వద్ద కారు, బైక్ ఢీకొని ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు కారులో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి వెళ్తుండగా అప్పన్నపేట గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్‌కు కారు ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు కిందకి దించడంతో కారులో ఉన్న జిల్లా అధికారికి గాయాలు కాగా, ద్విచక్ర వాహనదారుడు గాయాల పాలయ్యాడు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వద్ద బుధవారం నడుచుకుంటూ వెళ్తున్న మహిళకు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పత్రి బాలవ్వ (42)కు తీవ్రగాయాలయ్యాయి. బాలవ్వ సిరిసిల్లలో తోపుడు బండిపై వీధుల్లో తిరుగుతూ పాత సామగ్రి కొనుగోలు చేస్తుంది. తిరిగి కాలినడకన ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బాలవ్వను లారీ ఢీకొంది. ఆమె కిందపడి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు .

గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ ముందు ఉన్న గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన చోటు చేసుకుంది. బుధవారం ఉదయం గ్రామపంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ వద్దకు వచ్చి చూడగా ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రాజేష్‌కు తెలుపగా రాజేష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై కారును ఢీ కొట్టిన లారీ

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం కారును లారీ ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఆర్చరీ క్రీడాకారుడిని అభినందించిన కలెక్టర్


క్రీడాకారున్ని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి కల్చరల్/ఎలిగేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఆర్చ రీ పోటీలకు ఎంపికైన ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తాని పర్తి యశ్వంత్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈనెల4న జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న యశ్వంత్ అండర్17 బాయ్స్ కాంపౌండ్ విభాగం లో కాంస్య పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. గుజరాత్ రాష్ట్రంలో ఈనెల 11,12 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి క్రీడలకు జిల్లా విద్యార్థి ఎంపిక కావడంపై కలెక్టర్ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లికల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగిన కళా ఉత్సవాలలో గట్టేపల్లి విద్యార్థులు నాటికల విభాగంలో పాల్గొని ప్లాస్టిక్ తో ప్రమాదం అనే నాటికను ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికైనారు.ఈసందర్భంగా విజేతలైన విద్యార్థులను బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. కళా రంగంలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాధికారి డి.మాధవి, అకడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీ.ఎం. షేక్, కళా ఉత్సవాలు జిల్లా ఇన్చార్జి జి. జగదీశ్వర్, పాఠశాల హెచ్ ఎం. అన్నపూర్ణ , అభినందించారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ రాజమల్లును అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. డిసెంబర్ నెల చివరిలో మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరి విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


సాయికృష్ణ(ఫైల్)


తాండ్ర శ్రీహాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కరీంనగర్-జగిత్యాల రోడ్డులో ట్రినిటి కళాశాల దగ్గర మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కొత్తపల్లిలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన చిలుముల సాయికృష్ణ (23), వీణవంక మండలం చల్లూరుకు చెందిన తాండ్ర శ్రీహాస్(20) మృతిచెందగా జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామానికి చెందిన మామిడిపల్లి నాగరాజు(21)కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయటంతో ఇద్దరి ప్రాణాలు గాలిలో కలిశాయని మృతుల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆరోపించారు. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీరు ముగ్గురు స్నేహితులు కాగా కొంత కాలంగా కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో ఒక గదిని అద్దెకు తీసుకుని ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 11 గంటలకు రెస్టారెంట్‌లో విధులు ముగించుకుని ఒక హోటల్‌కు వెళ్లి భోజనం పార్సిల్ తీసుకుని బైక్‌పై గదికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. బైక్ ముందు వెళ్తున్న లారీని డ్రైవర్ అకస్మాత్తుగా పక్కకు తిప్పాడు. దీంతో బైక్ అదుపుతప్పి లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు లారీ వెనుకభాగంలో చిక్కుకున్నారు. అలాగే 100 మీటర్ల దూరం వరకు వారిని లారీ ఈడ్చుకెళ్లింది. తీవ్ర గాయాలైన సాయికృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీహాస్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. నాగరాజు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చేతికందివచ్చిన కొడుకులు మరణం వార్తతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. నిర్లక్ష్యంగా, లారీని నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని సాయికృష్ణ తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రెండో టాణా పోలీసులు తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు

- మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్, నవంబర్, 6 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినా, తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని వేంపేట గ్రామం నుంచి అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా బుధవారం సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. సిబ్బందితో కలిసి వేంపేట శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమాన స్పదంగా నిజామాబాద్ జిల్లాకు వెళ్తున్న టీఎస్ 07యూఎఫ్6840 నంబర్ గల ట్రాలీ ఆటో ను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 20 కింటాళ్ల బియ్యాన్ని సంచుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన పద్మ రంజిత్ కుమార్ అనే ఆటో డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని నిజామాబాద్‌కు తరలించి అక్కడి నుంచి మహారాష్ట్రలో విక్రయించడానికి తరలిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. దీంతో రేషన్ బియ్యంతో పాటు వాహనం, నిధింతుడుని అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించారు.

విరిగిన స్తంభం.. తప్పిన పెను ప్రమాదం

వీర్నపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో ప్రదాన రహదారిపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు ధాన్యం తరలిస్తున్న లారీ తగలడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం విరిగి ఇంటిపై పడింది. దీంతో ఆ కుటుంబంలోని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ స్తంభం దగ్గర ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభం విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ధాన్యం లారీని అక్కడి నుంచి తరలించారు. విద్యుత్ తీగలను సరిచేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రమేష్ తెలిపారు.


లారీ తగలడంతో తెగిపడ్డ విద్యుత్ తీగలు

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్

సిరిసిల్లటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ హాస్టల్స్ గురుకులాల్లో విద్యార్థుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. బుధవారం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో సంక్షేమ హాస్టల్స్, గురుకులాల పాఠశాలలో అనేక సంఘటనలతో విద్యార్థులు మరణించారని ఆరోపించారు. కొందరు విద్యార్థులు పాము కాటుకు గురికాగా, మరికొందరు ఫుడ్‌పాయిజన్‌తో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌కు, గురుకులాలకు విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారని అన్నారు. కొమరం భీం జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో దాదాపు 60 మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురికాగా అందులో ముగ్గురు విద్యార్థుల పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారని అందులో ఒక్క విద్యార్థి వెంటిలేటర్‌పై ఉన్నారని అన్నారు. విద్యాశాఖ, గిరిజన శాఖ మంత్రిగా కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధిత విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించక పోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై, విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టకుంటే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు షేక్ సికిందర్, నాయకులు ఎస్కే బాబా, మెట్టెల సాయిదీప్, వల్లబోజు రమణచారి, కణుకుంట్ల వెంకటరమణ, గాజుల మనిదీప్, గుజ్జె తరుణ్, రాచమల్లు మోహన్, హాశ్వక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో బైక్ అదుపుతప్పి తల్లి, కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు సూత్రాల సంపత్ అతని తల్లి లక్ష్మితో కలిసి బోర్నపల్లిలోని సోదరి ఇంట్లో శుభకార్యానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా కొత్తగట్టు శివారులో గుంతలో పడి బైకు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. సంపత్, అతని తల్లి లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా పోలీసులు క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో పతకాలు సాధించాలి

డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్



ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో మంచి ప్రతిభ కనబరిచి ఎక్కువ పతకాలు సాధించాలని కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నగరంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లాస్థాయి అండర్-14, 17 బాలుర రెజ్లింగ్ పోటీలను బుధవారం డీవైఎస్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కరీంగర్ జిల్లాకు క్రీడలపరంగా మంచి పేరుందని, దీనిని కొనసాగించేందుకు క్రీడాకారులు శ్రమించాలన్నారు. క్రీడాకారులు నిత్య సాధనతో మెరుగైన ఫలితాలు సాధించగలరన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 8 నుంచి హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుకుమార్, ఫిజికల్ డైరెక్టర్లు ఎ శంకరయ్య, వి పూర్ణసాయి అఖిల్, సైనిక్ పాఠశాల రెజ్లింగ్ కోచ్ ఎం వంశీకృష్ణ, పీఈటీ సఫియా, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎస్‌యూ ఖో-ఖో పోటీల విజేత ఎస్సారార్ జట్టు



శాతవాహన యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఖో-ఖో పోటీల విజేత ఎస్సారార్ కళాశాల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాల ఖో-ఖో పోటీల విజేతగా ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల జట్టు నిలిచింది. అలగప్ప యూనివర్సిటీలో నిర్వహించనున్న అంతర యూనివర్సిటీ పోటీలకు కళాశాలకు చెందిన జె గణేశ్, ఎం కిశోర్, కె శ్రీరాం, సీహెచ్ అఖిల్, పి వెంకటేశ్, బి గణపతి, జి తిరుమలేశ్, ఎం రాహుల్, ఎల్ వర్ధన్‌లు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల జట్టును ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, అధ్యాపకులు పడాల తిరుపతి, ఎం మల్లారెడ్డిలు అభినందించారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా అజీమ్

జగిత్యాలరూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో పీడీగా పనిచేస్తున్న అజీమ్ ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 బాలికల, బాలుర బాస్కెట్‌బాల్ పోటీలకు కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరితాదేవి, వైస్‌ప్రిన్సిపాల్ నగేష్, ఉపాధ్యాయ బృందం అజీమ్‌ను అభినందించారు.

ఏ దేశమైనా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే విద్యుత్ తప్పనిసరి. దేశంలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు 1975 నవంబరు 7న నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎన్టీపీసీ ఆవిర్భావంతో దేశీయ విద్యుత్ రంగంలో నూతన శకం ప్రారంభమైంది. ప్రస్తుతం దేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో నాలుగో వంతుకుపైగా (76,475.68 మెగావాట్లు) ఎన్టీపీసీ ఉత్పత్తి చేస్తోంది. థర్మల్, గ్యాస్, జల విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తితోపాటు బొగ్గు గనుల నిర్వహణ, గ్యాస్ నిక్షేపాల అన్వేషన(ఎక్స్‌ప్లోరేషన్), కన్సల్టెన్సీతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర సంస్థలకు అందజేయడం, ఇలా అంచెలంచెలుగా ఎదిగిన ఎన్టీపీసీ గురువారంతో 49 ఏళ్లు పూర్తి చేసుకొని 50వ వసంతంలోకి అడుగు పెడుతూ స్వర్ణోత్సవాలకు సిద్ధమైంది.

ఎన్టీపీసీ @50

- స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు
- నేడు ఆవిర్భావ దినోత్సవం

జ్యోతినగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : దేశీయ విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకపాత్ర పోషిస్తున్నది. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తంలో నాలుగో వంతు ఎన్టీపీసీ నుంచి లభిస్తున్నది. విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఎన్టీపీసీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌గా ఉన్న ఎన్‌టిపిసి 14 ఏళ్ల క్రితం ఎన్టీపీసీ లిమిటెడ్‌గా అవతరించింది. 36 బొగ్గు ఆధారిత(థర్మల్), 7 గ్యాస్ (నాఫ్తా), 15 సోలార్ ప్రాజెక్టులు, 2 జల విద్యుత్ ప్రాజెక్టులు, ఒక విండ్, 9 జాయింట్ వెంచర్(సంయుకత్త రంగం)లో మొత్తం 97 ప్లాంట్లను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 76,475.68 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంగల సంస్థ 2032 నాటికి 1.28 లక్షల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించడానికి ప్రణాళికలను రూపొందించింది. ఎన్టీపీసీ గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 420 బిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి జరిపింది.

● నిరంతర అభివృద్ధి..

ఎన్టీపీసీ అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో పయనిస్తోంది. గత దశాబ్ద కాలంలో రికార్డుస్థాయిలో స్థాపిత సామర్థ్యాన్ని విస్తరించింది. మొత్తం దేశం స్థాపిత సామర్థ్యంలో 16 శాతం ఎన్టీపీసీకి ఉండగా ప్రస్తుత సంస్థ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 76,475 మెగావాట్లకు చేరింది. దేశవ్యాప్తంగా సుమారు 2 లక్షల కోట్ల రూపాయల నిధులతో కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణాలు(ఎన్టీపీసీ, జాయింట్ వెంచర్) వివిధ దశల్లో ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం ఎన్టీపీసీ గణనీయమైన లాభాలను ఆర్జించింది. గత 49 ఏళ్లలో ఎన్టీపీసీకి ఉత్పత్తి, సేఫ్టీ, సీఎస్‌ఆర్, మానవ వనరులు, పర్యావరణ పరిరక్షణ, పరిపాలన, నాణ్యత, బెస్ట్‌ప్లేస్ టు వర్క్ తదితర అన్ని అంశాల్లో పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి.

● బొగ్గు గనుల నిర్వహణ..

ఎన్‌టీపీసీ లిమిటెడ్ స్వయంగా బొగ్గు గనుల నిర్వహణకు పూను కున్నది. గత దశాబ్దకాలంగా దేశం లోనే అత్యధిక మొత్తంలో బొగ్గును వినియోగిస్తున్న ఎన్టీపీసీ గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో 250 మిలియన్ టన్నుల బొగ్గును విని యోగించినట్లు అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. ఇంధన కొరతను ఎదుర్కొనడానికి దేశవ్యాప్తంగా 10 బొగ్గు బ్లాకులు(107 బిలియన్ మెట్రిక్ టన్నులు) ఎన్టీపీసీకి ఉన్నాయి. సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా చిన్న విద్యుత్ కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రణాళికలు సంస్థ రూపొందించింది. సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా 50,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎన్టీపీసీ భావిస్తున్నది. దీనిలో ప్రధానంగా సోలార్, పవన, జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించింది.



రామగుండంలోని ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు

● స్వర్ణోత్సవాలకు రెడీ..

ఈ ఏడాదితో 50వ వసంతంలోకి అడుగుపెట్టిన ఎన్టీపీసీ స్వర్ణోత్సవాలను నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ఏడాదిపాటు దేశ వ్యాప్తంగా ఎన్టీపీసీ ప్రాజెక్టుల ప్రాంతాల్లో, కార్పొరేట్ సెంటర్(ఢిల్లీ)లో స్వర్ణోత్సవాలను జరుపుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సాంస్కృతిక, క్రీడోత్సవాలను నిర్వహించనున్నది. అలాగే 50 ఏళ్ల సందర్భంగా ఉద్యోగులకు ప్రత్యేక కానుకను ప్రకటించే అవకాశముంది.



గుజరాత్ రాష్ట్రంలోని ఆంతా విద్యుత్ కేంద్రం (గ్యాస్)

● గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం..

థర్మల్(బొగ్గు ఆధారిత) విద్యుత్ కేంద్రాల నిర్వహణ కోసం నెలకొల్పిన ఎన్టీపీసీ మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. కాలుష్య నివారణలో భాగంగా దేశ వ్యాప్తంగా సోలార్, పవన, జియో థర్మల్, జల విద్యుత్‌ను విస్తరిస్తోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పి ముందుకు సాగుతున్నది.



రామగుండంలోని ఎన్టీపీసీ

గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణపై గ్రామ సభ

చిగురుమామిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో బుధవారం గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ భూసేకరణ నోటిఫికేషన్‌పై గ్రామ సభ నిర్వహించారు. కరీంనగర్ ఆర్డీవో కె.మహేశ్వర్ మాట్లాడుతూ గౌరవెల్లి కెనాల్ భూసేకరణలో భాగంగా గ్రామంలో భూమిని కెనాల్ పనులకు వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను అధికారులు గ్రామ సభలో చదివి వినిపించారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈ ప్రశాంత్ ఏఈ నెహ్రూ, ఆర్‌ఐ అరుణ్‌కుమార్, రైతులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు ముత్తోజు శ్రీనివాస్

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేసి స్వర్ణకార వృత్తిని కాపాడాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు ముత్తోజు శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రెస్‌భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్లో కార్పొరేట్ జువెల్లరీ సంస్థల వల్ల స్వర్ణకార వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చేతిలో పనిలేక, ఉండేందుకు ఇల్లు లేక, పిల్లలను చదివించుకోలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో సుమారు 200 మంది వరకు స్వర్ణకారులు బలవన్మరణాలకు పాల్పడ్డారని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఆంధ్రప్రదేశ్ మాదిరిగా తెలంగాణలో కూడా స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కడార్ల శివప్రసాద్, ప్రధానకార్యదర్శి కట్ట జగన్, కోశాధికారి కడార్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రావుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కడార్ల చంద్రశేఖర్, వెగ్గలం రామకృష్ణ, రాష్ట్ర నాయకులు కట్ట రాజబ్రహ్మం, ముత్తోజు మహేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామూహిక కార్తీక దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కార్తీకదీపోత్సవం కొనసాగుతుంది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో సామూహిక కార్తీక దీపాలను వెలిగించారు. ఓం, లింగాకారం, స్వస్తిక్ ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ఆలయ ఏఈవో జయకుమారి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఐదో రోజు బుధవారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు, గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ నదీ మాతను వేడుకున్నారు. రాత్రి వరకు నదీ మాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేద పండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమ ణాచారి, నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు అరుణ్‌కుమార్, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, నవీన్, మోహన్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురిలో గోదావరి వద్ద హారతి

రాష్ట్రస్థాయి ఆర్బీఐ క్విజ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గణేశ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ అటానమస్ కళాశాలకు చెందిన బీబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు జే విశ్వతేజ, జే సిద్ధార్థలు ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రోగ్రాంలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి ఆర్బీఐ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబరు 18వ తేదీన హైదరాబాదులో నిర్వహించే ఆర్బీఐ క్విజ్ పోటీలలో ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీయడానికి ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర స్థాయిలో సైతం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ లీడ్ బ్యాంకు మేనేజర్ టీవీఎస్‌ఆర్ ఆంజనేయులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొడిమ్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్ 14 వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. టోర్నమెంట్‌లో బాలికల విభాగంలో రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రథమ బహుమతిని, బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని జగిత్యాల జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య, ఎంఈవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ లక్ష్మీనాయక్, ప్రెజిడెంట్ విశ్వప్రసాద్, మండల సెక్రెటరీ రాజమల్లయ్య, పీడీలు అనూప్‌రెడ్డి, వీరుపాల్‌రెడ్డి, దేవయ్య, హరీష్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మహేష్, అజీం, ప్రభాకర్, అనిల్, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





బాలికల విభాగంలో ప్రథమ బహుమతి పొందిన సిరిసిల్ల జట్టు, బాలుర విభాగంలో ప్రథమ బహుమతి పొందిన జగిత్యాల జట్టు

ప్రభుత్వం వైద్యులకు అండగా ఉంటుంది

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఐఎంఏ కార్యవర్గం

సుభాష్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం వైద్యులకు అండగా ఉంటుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు బుధవారం కరీంనగర్‌లోని ఐఎంఏ హాల్లో కరీంనగర్ ఐఎంఏ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్లపై దాడులు చేస్తే ఉపేక్షించేదిలేదన్నారు. డాక్టర్లు కూడా విలువలతో కూడిన వైద్యం అందించాలని కోరారు. ఆసుపత్రుల ఏర్పాటు కోసం సింగిల్‌విండో విధానం ఏర్పాటు చేయాలని వైద్యులు కోరిన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలో 16 మండలాలు ఉన్నాయని ప్రతినెల ఓ మండలం చొప్పున ఆధ్వర్యంలో ఐఎంఏ ఆధ్వర్యం లో వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ గురుకులాలు మోడల్ స్కూలు, ఇతర పాఠశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు వైద్య సేవలు అందించాలని కోరారు ఇటీవల కాలంలో చాలా మంది గుండెపోటుకు గురవుతున్నారన్నారు. అందుకు పలు రకాలు కారణాలు ఉన్నప్పటికీ అందులో అత్యధిక మోతాదులో మందులు రాయడం కూడా ఒక కారణం అనే ప్రచారం జరుగుతోందన్నారు. దీనిపై వైద్యులు దృష్టి సారించాలన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్లపై దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్ కుమార్, కోశాధికారి డాక్టర్ విజయ్ కుమార్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామ్‌కిరణ్, మాజీ కార్యదర్శి డాక్టర్ వెంకటరెడ్డి, మాజీ కార్యదర్శి డాక్టర్ మల్లికార్జున్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాళి ప్రసాద్ రావు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు, డాక్టర్ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి, ఎలెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ పి కిషన్, డాక్టర్ కవిత డాక్టర్ ఎమ్మెల్యేన్ రెడ్డి పాల్గొన్నారు.

పీజీ కళాశాలను సందర్శించిన వైస్‌ఛాన్స్‌లర్

కోల్‌సిటీటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలను బుధవారం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ యు.ఉమేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్నటువంటి సదుపాయాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని, తరగతులకు హాజరుకావాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు అవసరమైనటువంటి కంప్యూటర్ ల్యాబ్, ఇతర సౌకర్యాలను త్వరలోనే సమకూరుస్తానని విద్యార్థులకు సూచించారు. కళాశాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్, సావిత్రి, యాదయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం డిపోలో నిలిచిన సరఫరా

- రెండు రోజులుగా సాంకేతిక లోపం అంటున్న అధికారులు
- ధరల పెంపుపై జోరుగా ప్రచారం

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మద్యం డిపోల నుంచి రిటైల్ షాపులకు మద్యం సరాఫరా మంగళవారం నుంచి రెండు రోజులుగా నిలిచిపోయింది. మద్యం వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా మంగళవారం, బుధవారం మద్యం కొనుగోలుకు చలాన్ చెల్లించినప్పటికీ ఇన్‌వాయిస్ రావటం లేదు. మద్యం డిపో సైట్ ఓపెన్ కావటం లేదు. మద్యం ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వం 'సీటెల్' సైట్ ద్వారా అమ్మకాలు సాగిస్తున్నది.

జిల్లాల్లోని మద్యం డిపోలకు కేటాయించిన కోడ్ ఆధారంగా ఆయా డిపోల పరిధిలోని మద్యం దుకాణా లైసెన్స్‌దారులు చలాన్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగానే మద్యం స్టాక్‌ను చూపిస్తుంది. వ్యాపారులు తమకు అవసర మున్న మద్యం సెలెక్ట్ చేసకున్న తరువాత ఇన్‌వాయిస్ వస్తుంది. ఇన్‌వాయిస్ ఆధారంగా మద్యం డిపో నుంచి స్టాక్‌ను మద్యం షాపులకు పంపిస్తుంటారు. అయితే రెండు రోజులుగా సీటెల్ సైట్ ఓపెన్ కానందున దుకాణాలలో మద్యం సరుకు అయిపోవస్తుందని ఆందోళన చెందుతున్నారు. సైట్‌లో సాంకేతిక లోపం తలెత్తిన కారణంగానే సైట్ ఓపెన్ కావటం లేదని మద్యం డిపో అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల్లో మద్యం ధరలు ప్రభుత్వం పెంచనుందని ఈ కారణంగానే ప్రభుత్వమే సైట్‌ను నిలిపివేసిందనే ప్రచారం మద్యం వ్యాపారుల్లో చర్చ జరుగుతోంది.

కరీంనగర్ మద్యం డిపో ద్వారా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన 192 వైన్‌షాపులు, 56 బార్‌లకు మద్యం సరఫరా అవుతున్నది. కరీంనగర్ మద్యం డిపోలో రోజుకు 3 కోట్ల వ్యాపారం సాగుతుంది. ఈ లెక్కన 6 కోట్ల వ్యాపారం నిలిచిపోయింది. అయితే ధరలు పెరుగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పాత ధరలకు కొనుగోలు చేయాలనే ఉద్దేశంలో పెద్ద ఎత్తున మద్యం కొనుగోలుకు వ్యాపారులు చలాన్‌లు చెల్లించి సిద్ధమయ్యారు. తీరా మద్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తుండగా రెండు రోజుల నుంచి సైట్ తెరుచుకోలేక పోవటంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విస్కీ ఫుల్ బాటిల్‌పై 70 రూపాయలు, బీరుపై రూ.20 వరకు ధరలు పెరిగే అవకాశముందని సమాచారం.

న్యూస్ బాక్స్

ఎస్‌యూ వీసీకి సన్మానం

గణేశ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ నూతన వీసీగా నియామకమైన ఉమేష్‌కుమార్‌ను బుధవారం ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో విద్యాప్రమాణాలు పెరిగేలా, యూనివర్సిటీ అనుబంధంగా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరామని చెప్పారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ మార్చాలని, యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని కోరామని తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అభినందన

గణేశ్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలోని ఉర్దూ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ హమేరా తస్లీమాను బుధవారం వీసీ ఉమేష్‌కుమార్‌తో పాటు సిబ్బంది అభినందించారు. న్యూఢిల్లీలోని గాలిబ్ అకాడమీ ఈ నెల 3వ తేదీన ఆమెకు జాతీయ స్థాయిలో ఉర్దూ భాషలో నిష్ణాతురాలిగా గుర్తించి అవార్డు అందజేసింది.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి

సైదాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఎఫ్ఎల్ఎన్, లిప్, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల టైం టేబుల్, తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. గణితం, ఫిజికల్ సైన్స్‌కు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. . కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

హుజూరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం శూద్ర హిందీ అనువాద కథల పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు హిందీ పండిట్, రచయిత ఇమ్మడి సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకావిష్కరణను ప్రముఖ కవి, రచయిత ప్రొఫెసర్ కాశీం ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ కోచ్‌గా రామకృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ కోచ్‌గా రామ కృష్ణ బింధుమాధవన్ నియమితులయ్యారు. డిప్లామా పూర్తి చేసిన రామకృష్ణ కలెక్టర్ అనుమతితో బ్యాడ్మింటన్ కోచ్‌గా నియమితులైనట్లు డీవైఎస్‌వో వి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో రమేశ్

కరీంనగర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆ సంఘ సీఈవో రమేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు గన్ను రాజిరెడ్డి, గాదె శ్రీనివాస్, కమటం మల్లేశం, మిడిదొడ్డి వీరేశం, ఎడ్లసత్యనారాయణ, కాంరెడ్డి నారాయణరెడ్డి, సాయి వేణు, శ్రీనివాస్, చింతం అశోక్, చెప్పాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి సహకార సంఘం పరిధిలోని దేవంపల్లి, లలితాపూర్ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మర్రి ఓదెలు ప్రారంభించారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కసిరెడ్డి లత, డైరెక్టర్లు మర్రి కొమురయ్య, సహదేవ్, ముత్తునూరి కొమురయ్య, సీఈవో మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లందకుంట: అరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యాన్ని రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని ఇల్లందకుంట సింగిల్ విండో వైస్ చైర్మన్ కందాల కొంరెల్లి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొంరెల్లి, తహసీల్దార్ రాణి, ఏవో సూర్యనారాయణతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో ఎగిత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమగ్ర సర్వే ప్రారంభం

కరీంనగర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం కరీంనగర్ మండలంలో బుధవారం అన్ని గ్రామాల్లో ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లో ఎన్యూమరేటర్లు, మండల అధికారులతో పాటు గ్రామ కార్యదర్శులు ఇంటింటి సర్వేలోపాల్గొన్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి కుటుంబాలను గుర్తించి నివాసాల గృహాలకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు పాల్గొన్నారు.

మానకొండూర్: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని బుధవారం డీఆర్‌డీవో పీడీ శ్రీధర్ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు వారికి కేటాయించిన ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మీ, ఎంపీవో కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వే తీరును ఎంపీడీవో టీ. వసంత, ఎంపీవో సతీష్ కుమార్ పరిశీలించారు. 4559 నివాస గృహాలను సర్వేలో గుర్తించినట్లు ఎంపీడీవో తెలిపారు.

గంగాధర: గంగాధర మండలంలో బుధవారం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. గ్రామాల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ సర్వే స్టిక్కర్లను అంటించారు. గంగాధరలో ఎంపీడీవో రాము, మధురానగర్‌లో ఎంపీవో జనార్దన్‌రెడ్డి సర్వేను పరిశీలించారు.

రామడుగు: మండలంలోని గ్రామాల్లో ఎన్యూమరేటర్స్ ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లు అతికించారు. వెదిరలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ల శారద కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేను మండల ప్రత్యేకాధికారి అనిల్ కిరణ్, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, ఎంపీడీవో రాజేశ్వరి పరిశీలించారు.

సైదాపూర్: గ్రామాల్లో ఇంటింటికీ ఇన్యూమరేటర్లు మొదటి రోజు స్టిక్కర్లు వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్యూమరేటర్లు సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం బుధ వారం చేపట్టారు. ఎంపీడీవో పుల్లయ్య శ్రీరాములపల్లె గ్రామంలో సర్వే చేపట్టగా 30మంది అధికారులు ఆయా గ్రామాల్లో సర్వే చేశారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ నిర్మాణం

- సొంత డబ్బులతో కార్పొరేటర్ గోడ పూర్తి

కరీంనగర్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాల్గవ డివిజన్ పరిధిలో భారీ డ్రైనేజీ నిర్మాణం చేసిన అధికారులు డ్రైనేజీపై కనీసం కప్పు (స్లాబ్) వేయకుండా వదిలిపెట్టారు. దీనితో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ఆ డివిజన్ కార్పొరేటర్ నుజహత్‌ఫర్‌హీన్ అలీ మేయర్ సునీల్‌రావు దృష్టికి తీసుకెళ్ళగా ఆయన వెంటనే డ్రైనేజీకి అడ్డంగా ప్రహరీ గోడతోపాటు జాలీ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీనితో డ్రైనేజీకి అడ్డుగా గోడ నిర్మించేందుకు రూపొందించిన ప్రతిపాదనలను కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు మాత్రం గోడను నిర్మించకుండా రెండేళ్ళ నుంచి నిర్లక్ష్యంగా వదిలిపెట్టారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చివరకు కార్పొరేటర్ నుజహత్ ఫర్‌హీన్ అలీ భర్త తన సొంత డబ్బులతో బుధవారం గోడను నిర్మించారు.

ఎస్సారెస్పీ భూమిని కాపాడాలి

హుజూరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ రోడ్‌లో ఎస్సారెస్పీ ప్రధాన కాలువను అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని యువజన కాంగ్రెస్ నాయకుడు టి శ్రావణ్ బుధవారం ఆర్డీవో రమేశ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున అందరికీ అందుబాటులో ఉన్న కళాభారతి ఆడిటోరియంను ఆధునీకరించి కళలు, కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కళాభారతి ఆడిటోరియం ఆధునీకరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆడి టోరియం ఆధునీకరణకు 14 లక్షలు ఇచ్చారని, అవసరమైతే మరో 10 లక్షలు ఇవ్వాలని కోరుతామని అన్నారు. కార్యక్రమంలో ఈఈ రొడ్డ యాదగిరి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు

- తరుగు పేరిట సిబ్బంది దోపిడీ చేస్తున్నారని రైతుల ఆవేదన
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

కరీంనగర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతోంది. రైతులు ధాన్యం తరలించి కేంద్రాల్లో ఆరబెడుతున్నారు. సిబ్బంది కాంటా వేసేందుకు ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దుర్శేడ్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఆరు కేంద్రాలను, ఐకేపీ ఆధ్వర్యంలో 2 కేంద్రాలు ఏర్పాటు చేసి యేటా కొనుగోళ్ల నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు రైస్ మిల్లర్ల ఒప్పందంతో ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రారంభం అయ్యి కాంటాలు వేస్తున్నారు. కాంటా వేస్తున్న సిబ్బంది తరుగు పేరిట తమను దోపిడీ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. తాలు తొలగిస్తే 41కిలోలు పూర్తిస్థాయిలో అదికూడా సంబంధిత ఏఈవో ధ్రువీకరిస్తేనే కాంటా పెడుతున్నట్లు తెలిసింది. లేకుంటే 42కిలోల కాంటా వేస్తున్నారు. అదేంటని అడిగితే తాలు తొలగించి తీసుకురావాలని నిర్వహకులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తరుగు పేరిట ఇబ్బందులు కలుగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



నగునూర్‌లో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

పోకిరీలకు 'షీ' టీంల దడ

(5వ పేజీ తరువాయి)

షీ టీం పోలీసులు వేధింపులు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో నిఘాను కొనసాగిస్తూ ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం ద్వారా పోకిరీల ఆధారాలను సేకరిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. మహిళలు, విద్యార్థినిలు నేరుగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా సెల్‌ఫోన్, వాట్సాప్, ట్విట్టర్ ద్వారా చేయవచ్చు. ఫిర్యాదు చేసిన మహిళలు విద్యార్థుల పేర్లను గోప్యం గా ఉంచడంతో పాటు వారిని పోలీసు ఠాణాలకు రమ్మనకుండా షీ టీం పోలీసులు బాధిత మహిళల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. టీంల చురుకైన పనితీరుకు విశేష స్పందన లభిస్తున్నది. మహిళల భద్రత కోసం పోలీసుశాఖ షీ టీంల ద్వారా తీసుకుంటున్న చర్యలు భద్రతా భావాన్నిపెంపొందిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా పోకిరీల వేధింపులపై చర్యలు తీసుకుంటున్నారు. దీంతో మహిళలు, విద్యార్థులు నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'సాన్వి' విద్యార్థులు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న చైర్మన్ మునీందర్, ప్రిన్సిపాల్ ప్రసాద్

భగత్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని సాన్వి జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్, ప్రిన్సిపాల్ ప్రసాద్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా తరపున హ్యాండ్‌బాల్ పోటీలకు శివచరణ్, బాస్కెట్‌బాల్‌లో రామ్‌చరణ్, కబడ్డీలో సదీప్, అథ్లెటిక్స్‌లో మనోజ్, క్రిష్‌కుమార్, తరుణ్, కోకోలో ప్రణయ్, ఫుట్‌బాల్‌లో మోతె రవితేజ, తైక్వాండో భానోత్‌జగదీష్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కోచ్‌లు అఖిల్, అజయ్, సుభాష్, మోహన్, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థినులు..

కరీంనగర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల శాతవాహన యూనివర్సిటీ నిర్వహించిన ఇస్రాబ్ కబడ్డీ టోర్నమెంట్‌లో నగునూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ టి మాలతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతున్న సుస్మిత తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీ నిర్వహించబోయే సౌత్ కబడ్డీ టోర్నమెంట్‌కి శాతవాహన యూనివర్సిటీ పరిధి నుంచి ఎంపికైనట్లు పేర్కొన్నారు. వాలీబాల్ విభాగంలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న కావ్య ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్‌డైరెక్టర్ డాక్టర్ పర్వీనబేగం తెలిపారు.

విద్యార్థినికి అభినందన

రామడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని శ్రీప్రగతి హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న వేముండ్ల హాసిని అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటడంతో బుధవారం పలువురు అభినందిచారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అన్నదానం రాధాకృష్ణ, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 6: కరీంనగర్ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి) ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం పలువురు అభినందించారు. జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు.. ఎల్ఐసీ ప్రధాన కార్యాలయంలో కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటి ఫర్ నేషనల్ ప్రాస్పరిటీ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 30కిపైగా ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వింధ్యావాలీ విద్యార్థులు ఏ హర్షిత రెడ్డి, డి నిత్య హర్షిని, ఎస్ వర్షిత విజేతలుగా నిలిచి బహుమతులను అందుకున్నారు. ఈ మేరకు పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ ఆర్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

కౌశిక్‌రెడ్డితో బీఆర్‌ఎస్ పార్టీ అసత్య ప్రచారం



జమ్మికుంటలో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి

జమ్మికుంట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేయిస్తోందని పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ కౌశిక్‌రెడ్డిని ఒక పావులా వాడుకుంటుందన్నారు. దీంతో ఇష్టం వచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో సీఎంఆర్ కింద లక్షకు రూ. లక్ష లబ్ధిదారులకు వచ్చేవని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 20వేలు కూడా రావడం లేదని కౌశిక్‌రెడ్డి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. గత ప్రభుత్వంలో లక్షకు లక్ష ఇచ్చిన సీఎంఆర్ చెక్కులు చూపించాలని కౌశిక్‌రెడ్డికి సవాల్ విసిరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న-కోటి, నాయకులు సుంకరి రమేష్, రామారావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రాచీనమైన వావిలాలపల్లి శ్రీసీతారామచంద్రస్వామి 27వ వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు అధ్యయనోత్సవం ప్రారంభమై శుక్రవారం సాయంత్రం పరమపదోత్సవంతో ముగుస్తుంది. శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతారు.

'బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు మానుకోవాలి'

ఇల్లందకుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్‌ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గుడిపు సారంగపాణి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయని బీఆర్‌ఎస్ పార్టీ నేడు రైతులపై మొసలి కన్నీరు కార్చడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటింటికి చేరుతాయ చెప్పారు. ఇందులో ఎలాంటి అనుమానం అవసరం లేదన్నారు. సమావేశంలో సంజీవరెడ్డి, వంగ రామకృష్ణ, పెద్ది కుమార్, రత్నాకర్, శ్రీనివాస్, మల్లయ్య, రాజబాబు, లింగయ్య, రమేష్, దిలీప్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ హామీలను అమలుచేయాలి'

భగత్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లోఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్ నగరసమితి ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాలపట్ల రాజు, సాయవేని రాయమల్లు, కిన్నెర మల్లవ్వ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపల్లి రాజు, నలువాల సదానందం, కొట్టె అంజలి, భారతి, కాల్వ శ్రీనివాస్, మామిడిపల్లి హేమంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం చివరి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యాన్ని అమ్ముకొని క్వింటాల్‌కు రూ. 900 రైతులు నష్టపోతున్నారన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల అభ్యున్నతి కోసం పైలెట్ ప్రాజెక్టు కింద దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. హుజూరాబాద్‌లో సుమారు 20వేల కుటుంబాలకు దళితబంధు ఇచ్చి ఆదుకున్నారన్నారు. రెండో విడత దళితబంధు డబ్బులు వారి అకౌంట్లో ఉన్నప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం అకౌంట్లను ఫ్రీజ్ చేసి దళితులను దగా చేస్తుందన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు తనను కాంగ్రెస్ నాయకులు కావాలనే బదనాం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి భట్టి విక్రమార్క దళితబంధు రెండో విడత ఎందుకు ఆపుతు బన్నారని ప్రశ్నించారు. ఈ నెల 9న హుజూరాబాద్‌లోని తన ఇంటి వద్ద టెంట్ వేసుకొని ఉంటానని, దళితబంధు రెండో విడత రాని వారంతా వచ్చి దరఖాస్తులు నేరుగా తనకే ఇవ్వాలన్నారు. దరఖాస్తులను కలెక్టర్ వద్దకు స్వయంగా తానే తీసుకెళ్లి కలెక్టర్‌కు అందజేస్తానన్నారు. ఈ నెల 20లోగా దళితులందరికి రెండో విడత దళితబంధు ఇవ్వకుంటే కాంగ్రెస్ నాయకులను, ప్రజాప్రతినిధులను నియోజకవర్గంలో తిరగనివ్వమన్నారు. సమావేశంలో బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, శ్రీనివాస్, సుశీల, ఇమ్రాన్, ముత్యంరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు బాధ్యతలు అప్పగించాలి

కరీంనగర్ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చామనపల్లి గ్రామంలో రేషన్ డీలర్‌ను తొలగించినందున బాధ్యతలు అర్హులకు అప్పగించాలని గ్రామస్థులు బుధవారం కలెక్టర్ పమేలా సత్పతితో పాటు సివిల్ సప్లయి అధికారులకు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంల లక్ష్మీనారాయణ, సంపత్, జి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస డిపాజిట్‌తోనే బీమా

కరీంనగర్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గాయత్రీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు కనీస డిపాజి ట్‌తోనే లక్ష రూపాయల ప్రమాద బీమా వర్తింపజేయడం అభినందనీయమని ఎల్ఐ సీ సీనియర్ డివిజనల్ మేనేజర్ పుల్లూరి స్వామి, డీవో రామేశ్వర్‌రావు అన్నారు. ప్రమా దవశాత్తు మృతిచెందిన గాయత్రీ బ్యాంకు ఖాతాదారుడు ఈరెల్లి రాజశేఖర్ కుటుంబసభ్యులకు బుధవారం చెక్కు అందజేశారు.

'స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి'

కరీంనగర్ అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులు, తీగల వంతెన నిర్మాణంలో భారీ అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్‌కుమార్, 30వ డివిజన్ అధ్యక్షుడు దొంతి గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 350 కోట్ల రూపాయలు ఖర్చు చేసి తీగల వంతెన పనులు నాణ్యత లేకుండా చేశారని తెలిపారు.

మత్స్యకారులను ప్రభుత్వం మోసగిస్తోంది

జమ్మికుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులను మోసం చేస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట గుండ్ల చెరువులో ఎమ్మెల్యే చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకొని అడ్డుకోవడం దారుణమన్నారు. మాపై దాడికి దిగడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

- కౌశిక్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట గుండ్ల చెరువులో చేపల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుల మధ్య బుధవారం వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే చెరువులో చేపలు వదిలిన తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏం లేదన్నారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేశిని కోటి, కౌన్సిలర్లు కౌశిక్‌రెడ్డి సమావేశాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కౌశిక్‌రెడ్డి మీ అంతు చూస్తా అంటూ కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. టౌన్ సీఐ వరంగంటి రవికుమార్ కలుగజేసుకొని ఇరు వర్గాలను శాంతింపజేశారు. దీంతో గొడవ సద్దుమనిగింది.

వైద్య సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- కలెక్టర్ పమేలా సత్పతి



ఆరోగ్యకేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

చిగురుమామిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టరు పమేలా సత్పతి అన్నారు. మండల కేంద్రంలోని బుధవారం ఆరోగ్య కేంద్రా న్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తూ అందుబాటులో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టరు అజయ్ యాదవ్, ఎంపీడీవో బాస మధుసూదన్, వైద్యాధికారి సందీప్‌రెడ్డి, స్టాఫ్ నర్స్ సునీత, ఫార్మాసిస్ట్ లీలా తదితరులు పాల్గొన్నారు. కాగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇటీవలి కాలంలో తనిఖీ చేసిన కలెక్టర్ రెండో సారి రావడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇలా ఉన్నతాధికారులు తనిఖీ చేస్తే సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించే అవకాశం ఉంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్మశానవాటిక దారి కోసం సర్వే

రామడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట బేడ బుడగ జంగ కులస్తుల శ్మశానవాటికకు వెళ్లడానికి వివాదం తలెత్తడంతో తహసీల్దార్ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

వాకింగ్ ట్రాక్‌కు నిధులు మంజూరు

హుజూరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 10లక్షలు నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రణవ్ వాకర్స్‌తో కలిసి మైదానంలో పర్యటించినప్పుడు వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్నామని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం రూ. 10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ. 7లక్షలతో వాకింగ్ ట్రాక్, రూ. 3లక్షలతో గేటు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

హుజూరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ పి శ్రీనివాస్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల, బీసీ వెల్ఫేర్ పాఠశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. యువత చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్, హెచ్ఎంలు సంపత్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని కనపర్తి, కొండపాక, ఇప్పలపల్లి గ్రామాల్లో సాం స్కృతిక సారధి వండ్లకొండ అనిల్ బృందం డ్రగ్స్ నివారణపై గ్రామాల్లో ప్రజలకు పాటల రూపంలో అవగాహన కల్పించింది. కార్యక్రమంలో కోమల, శ్రీధర్, రాజు,సురేష్, తిరుపతి, సాయికుమార్, నిజామొద్దీన్, శ్రీధర్, అసియా, పద్మ, తిరుపతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వీణవంక నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చల్లూరు గ్రామనికి చెందిన తాండ్ర హస్ కరీంనగర్ పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సాహెబ్ హుస్సేన్, రమేశ్, నల్ల కొండాల్‌రెడ్డి, సోహెల్, అలె మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.